# సీత సినీమా

శ్రీమతి ప్రాతూరి లక్ష్మమ్మగారు

శివరావు స్కూలుఫైనలు చదువుతున్నాడు. పదహారేళ్లు ఉంటాయి. అతని స్వగ్రామం పల్లెటూరగుటచేత మేనమామగారివూళ్లో చదువుతున్నాడు. మేనమామకుమారుడు ఆనందరావు కూడా యితని క్లాసె. ఆనందరావుకు ఇద్దరుచెల్లెళ్లు. పెద్దపిల్ల సీత. రెండవచెల్లెలు పూర్ణ. సీతను పుట్టినప్పటినుంచి శివరావుకు ఇస్తామనుకునే వ్వారు. సీత చాలచురుకైన తెలివిగల పిల్ల. తెల్లటి ముఖము, చక్రముల వంటి కళ్లు, చిన్ననోరు చాల అందముగా ఉంటుంది. ఆనందరావు, సీత ఒక పోలికగాఉంటారు. అంతా ఒకచోట ఉండుటవల్ల కలిసిమెలిసి యుండేవారు. శివరావు ముక్కోపి. సీతపట్టుదల కలది; పెంకెపిల్ల. పూర్ణ అమాయకురాలు. ఆనందరావు సరదామనిషిఅవుటచేత, సాయింకాలం యిస్కూలునుంచి రాగానె, చెల్లెళ్లనుకూడా తీసుకొని షికారువెడుతూఉండేవాడు. సీత శివరావుతోటి కబుర్లుచెపుతూ ఒకపక్కనె నడుస్తూ వెడుతూయుండేవారు.

ఒకరోజు శివరావు సీతను తీసుకొని బజారువయిపు వెళ్లేడు. ఆనందరావు పూర్ణ కూడావచ్చేరు. జనసమ్మర్దంగా ఉండుటచేత శివరావు సీత చెయ్యిపుచ్చుకొని నిమ్మదిగా నడుస్తూయున్నాడు. పూర్ణ అన్నగారితో కబుర్లుచెపుతు వెనకాల వస్తూంది. ఒకబొమ్మలదుకాణంమీదుగా అంతా వస్తున్నారు. సీతకి బొమ్మలంటె సరదా. బొమ్మలు కావాలని అడుగుతే కొనిపెడదామని నిమ్మదిగా నడుస్తూ వెడుతున్నాడు శివరావు. సీతకి చిన్నప్పటినుంచి చూచినదల్లా కావాలని అడిగేస్వభావము కాదు. తనకి కావాలసినది తెలుసుకుని కొనియిస్తే ఆనందపడేస్వభావం సీతది. వాళ్లఅమ్మకూడ సీత అడగకుండానె కావలసినది తెలుసుకుని కొనియిచ్చేది. సీతకి రంగుబట్టలంటే యిష్టంలేదు. తెల్లపరికిణీలయింటె ఆమెకు ఉత్సాహంజాస్తి. వాళ్ల అమ్మ యెప్పుడు సీతకి తెల్లబట్టలే కుట్టిస్తూయుండేది. ఎవరేనా బంధువులిండ్లకు వెడితె రంగుపరికిణీ పెడితె సీత ముఖముతిప్పుకుని పూర్ణకు యిచ్చేసేది. సీతమాత్రం తనపట్టు చెల్లించుకునే సమర్థురాలు. నాడు బావ బొమ్మలదుకాణంవద్ద నిమ్మదిగా నుంచోపెట్టి అటు యిటు చూస్తున్నట్టు నటిస్తూ, సీతకేసి చూస్తూనుంచున్నాడు. కాని సీతమాత్రం కావాలని అడుగలేదు. బొమ్మలకేసి ఉత్సాహంతో చూస్తునుంచుంది. కొంతసేపయినాక శివరావు "సీతా! నీకు యేబొమ్మలు బాగున్నాయి?" అన్నాడు. అప్పుడు ఆమె "ఆ పెద్దబొమ్మలు రెండూ యెంతఅందముగా ఉన్నాయొ; చూడు, బావ!" అంది. "సరే! పద. నీకు కావలసిన బొమ్మలు తీసుకుందువుగాని" అన్నాడు. "రేపు, అమ్మని అడిగి డబ్బులు తెచ్చుకుని కొనవచ్చునులే, బావ!" అంది. సీత తెలివికి, మాటనేర్పుకు శివరావు చాల సంతోషించేడు. "సీతా! నీకు కావలసినబొమ్మలు తీసుకో. డబ్బులకోసరం మీఅమ్మను అడగ నక్కరలేదులే" అన్నాడు. సీత కోరిన పెద్దబొమ్మలు, పూర్ణకు కొన్ని చిన్న చిన్న బొమ్మలు అతడు కొన్నాడు. ఈ లోపల వెనకపడ్డ పూర్ణ, ఆనందరావు వచ్చి కలుసుకున్నారు. పూర్ణ సీతచేతులో బొమ్మలు చూచి "అక్కయ్యా! నా కేనా యివి?" అంది. "నీకు కూడా కొన్నాను. నీకు కావలసినవి తీసుకో పూర్ణ!" అంది సీత. అప్పుడు పూర్ణ సంతోషంతో ఆలోచిస్తూ బొమ్మలవయిపుచూస్తూంది. సీత కోరిన బొమ్మలు పూర్ణకాజేస్తుందేమోనని చూస్తూనుంచున్నాడు శివరావు. "అన్నయ్యా! ఇంత పెద్ద బొమ్మలు నాకొద్దు. లక్కపిడతలు, చిన్న బొమ్మలు తీసుకుంటాను" అంది పూర్ణ. శివుడి ముఖం వికసించింది. సీతకు ఆనందం కల్గింది. ఇంటికి వచ్చేరు.

దొడ్లో మామిడిచెట్లు ఉన్నాయి. శివరావు, ఆనందుడు మామిడిచెట్లు యెక్కి కాయలు కోస్తున్నారు. సీత, పూర్ణ, యింకా యితరపిల్లలు దొడ్లో ఆడుకుంటున్నారు. వీళ్లు చెట్టుయెక్కి కాయలు కోయ్యడంచూశారు. పిల్లలంతా చెట్టువద్దకు పరిగెత్తుకు వచ్చేరు. మాకు మామిడికాయ వెయ్యవు అని శివానందులను అడిగేరు. సీత అడగకుండానే నుంచుంది. తను చాకుతో మామిడికాయ కోసుకుతిని లోపల జీడి సీతమీద పడేశాడు శివుడు. జీడిపడి సీత తెల్లచొక్కా పాడయింది. సీతకు ఉడుకుమోత్తనం వచ్చింది. సీత వెళ్లిపోయింది. పూర్ణ తల్లిదగ్గరకెళ్లి ఫిరియాదుచేసింది; బావ, అన్నయ్య మామిడికాయలు తింటూ తనకు పెట్టలేదని. తల్లి "ఆనందా! కాస్త దాని కొకకాయ యియ్యరాదురా?" అంది. "ఏదే? పూర్ణ నన్ను అడుగలేదు. రా, పూర్ణ! యివిగో, కాయలు" అన్నాడు ఆనందం. పూర్ణ మామిడికాయలు తెచ్చుకు తింటూ వెళ్లిపోయింది. సీతకు ఉడుకుమోత్తనం వచ్చినసంగతి శివుడు కనిపెట్టేడు. కాని అందరు కాయలడిగితే సీతమాత్రం యెందుకు తనను అడగకూడదు అని శివుడికి కోపంవచ్చింది.

సీత మూడవఫారం చదువుతూంది. తండ్రివద్ద సంస్కృతము నేర్చుకుంటూంది అప్పుడప్పుడు. బావ వద్ద హిందీ కూడా నేర్చుకుంటూయుంటుంది. పాఠములేమయినా తెలియనప్పుడు బావే చెప్తూయుంటాడు. సీత యీయేడు పరీక్షలో మొదటిబహుమానము అందినది. శివుడికి సాలుకు నాల్గువేలు వస్తాయి. ఒక్కడే పిల్లవాడు. వీరిది పల్లెటూరు. ఇంటివద్ద అతనితల్లి, విధవమేనత్త యుంటారు. వారు పూర్వాచారపరాయణులు. సీత యింకా చదువుట అతనితల్లి, మేనత్తలకు ఇష్టములేదు. కాని శివానందుల ప్రోత్సాహము వలననే చదివిస్తూయున్నారు. శివరావుతల్లి యీసంవత్సరం పెళ్లిచేస్తేనే గాని వీలు లేదని పట్టుపట్టింది. కాని పరీక్ష ప్యాసవుతేగాని పెళ్లిమాట తలపెట్టవద్దన్నాడు శివుడు. ఇప్పుడు బి. యే. చదువుతున్నారు శివానందులు.

శివరావు మంచిమామిడికాయలు రెండు కోసుకొని జేబులో వేసుకొని చెట్టుదిగి యింట్లోకి వచ్చేడు. సీత అంటే శివుడుకి ఒకవిధమయిన ప్రేమ. చిన్నప్పటినుంచి ఒకచోట పెరుగుటవలన, అంతాస్నేహంగా కూడా ఉండేవారు. శలవలు వచ్చినయెడల అందరు కలిసే వెళ్లేవారు. ఒకవేళ ఆనందు, సీత, పూర్ణ రాకపోతే "శివా! వాళ్లను కూడ తీసుకురాకపోయినావురా?" అనేది శివుడితల్లి. మరువాడే మనిషిని పంపి అందరను తీసుకురప్పించేది ఆమె. సీత కనుక ఒకరోజు కనపడకపోతే శివుడికి యెలాగో యుండేది. సీత యొక్క తెలివికి, ఆమె యొక్క బుద్ధిసూక్ష్మతకు, పట్టుదలకు చాల ఆనందపడేవాడు. సీతవంటి బాలిక తనకు భార్యకాబోవటంచేత తను ధన్యుడననుకునేవాడు. కాని సీతకు కూడా ఇష్టముందోలేదో కనుక్కోవాలని అతని అభిప్రాయం.

సీతకు పదమూడేళ్లు వచ్చేయి. కనుక బాగా ఊహవచ్చిన పిల్ల. సీత కోసరం యిల్లంతా వెతికేడు. తోటలోకి వెళ్లిందేమోనని చూచేడు. ఎక్కడా కనపడలేదు. సావిట్లో కుర్చీలో కూర్చున్నాడు. "పూర్ణ యింట్లోనుంచి పరిగెత్తుకువచ్చింది. "పూర్ణ! మాట, యిలరా" అన్నాడు బావ. "ఎందుకమ్మా! ఇందాక మామిడికాయ యియ్యలేదు, కాని" అంది పూర్ణ. "ఇస్తాను గాని. నిన్న నీకు లక్కపిడతలు, బొమ్మలు యియ్యలేదు" అన్నాడు. లక్కపిడతలమాట చెప్పేటప్పటికి పూర్ణముఖం వికసించింది. "ఏంకావాలి నీకు?" అంది. "మీఅన్నయ్య యేడి?" అన్నాడు. "స్నానం చేస్తున్నాడు, అమ్మ నిన్నుకూడా స్నానం చెయ్యమంది" అంది. "చూడు, సీత యేది?" అన్నాడు బావ. "మేడామీద చదువుకుంటూంది, ఎవరడిగినా చెప్పవద్దంది. ఎవరికి చెప్పకేం? బావ!" అని పూర్ణ పరిగెత్తుకు వెళ్లింది. శివుడు నెమ్మదిగా

డాభామీదకు వెళ్లి సీత వెనకాలనుంచున్నాడు. సీత హిందీ చదువుకుంటుంది. వెనక్కాలె వెళ్లి కళ్లు మూశాడు. సీత ఆనందరావేమోఅనుకుంది. కాని చెయ్యి తడివిచూసింది. ఉంగరం కనిపించింది. "అన్నయ్యకు ఉంగరం లేదు, బావవేలే, చేతులు తియ్యి" అంది. "సీతా! ఇక్కడ ఒక్కదానవు కూర్చున్నావేం?" అన్నాడు. "ఏమిలేదు. చదువుకుంటున్నాను" అంది. "ఏదైనా పాఠం చెప్పాలా?" అన్నాడు. "అక్కర లేదు. పాతపాఠాలు చదువుకుంటున్నాను" అంది. "సీతా! చొక్కామీద సిరా పోసుకున్నావేమిటి?" అన్నాడు. "అది సిరామరక కాదు. బావ జీడిమరక. అంటుకుంటే వదలదు" అని బావకేసి కోపంగా చూశింది. బావకు కోపం, నవ్వుకూడా వచ్చినవి. "పోనిలే. జీడెందుకు? కాయలిపగో, తిను." అని మామిడి ముక్కలు పెట్టేడు. "నాకు వద్దు" అని చదువుకుంటూ కూర్చుంది. "సీతా! నిన్ను ఒకసంగతి అడగాలని వచ్చేను. అడగనా?" అన్నాడు. "అడుగు, నీకు నేను చెప్పవలసిన సంగతు లేమిటి? నాకే యెన్నో సంగతులు పాఠములలో చెపుతూఉంటావు" అంది. "నీకు మీవాళ్లు పెళ్లిచేయాలనుకుంటూ యున్నారని విన్నాను, నిజమేనా?" అన్నాడు. పెళ్లిమాట చెప్పేటప్పటికి సీత సిగ్గుతో తలవంచుకుని "యేమొ, నాకు తెలియదు" అంది. "నీకు తెలియకున్న నేను చెపుతున్నాగా, విను. పక్కయింటి క్రిష్ణమూర్తికి యిస్తారుట" అన్నాడు. "ఆమాట నిన్ను నాతో చెప్పమనే యిక్కడకుపంపేరా" అంది కొంచెం కోపంగా. శివుడికి అల్పకోపసుందరమైన సీతముఖమును చూచేటప్పటికి నవ్వు వచ్చింది. "సీతా! నన్ను పెళ్లిచేసుకొనుట నీకిష్ట మేనా?" అని జవాబుకొరకు యెదురుచూస్తూ నుంచున్నాడు. "నీవు నీచదువు పూర్తి అవుతేగాని పెళ్లి చేసుకోవు కదా? ఇప్పుడు, యీమాటలెందుకు?" అంది నవ్వుతూను. "నీ యిష్టం తెలియనిదె పెళ్లిచేసు కొనుట యిష్టములేకనే అలాగ చెప్పినాను" అన్నాడు. సీత నవ్వి ఊరుకుంది. "సీతా! ఈచిన్నమామిడి ముక్క తినకూడదా?" అన్నాడు. "మామిడిముక్కలు తింటారా? జీడి తింటారనుకున్నాను" అని నవ్వి రెండుముక్కలు తీసుకుంది సీత. ఇద్దరు కిందకి వెళ్లిపోయారు.

సీతకు పరీక్షలుఅయి శెలవులు అగుటవలన అంతా మేనత్తగారింటివద్దనె ఉన్నారు. సీతతండ్రి ఒకరోజు అక్కగారితో సీతపెళ్లిమాట తెచ్చేడు. "శివుడితో చెప్పితే మాట్లాడలేదు, ఏమంటావు? అక్కయ్యా! నీ అభిప్రాయమేమిటి?" అని అడిగేడు. "సీతవంటిపిల్ల నాకోడలవడంకంటె నాకేమి కావాలి? అన్నయ్యా! అబ్బాయిని అడుగుతాను." అంది ఆమె. ఒకరోజున ఆమె "శివా! మామయ్య సీతకు పెళ్లిచేయాలని తొందర పడుతున్నాడు. నీ అభిప్రాయమేమిరా?" అంది. "సీతకు పెళ్లిచేయుట నాకు అభిప్రాయమేను. నేను వస్తాను సీతపెళ్లికి పిలుస్తేను." అన్నాడు శివుడు. తల్లి నవ్వి "అదికాదురా. నీవు సీతను చేసుకొనుటకు అభ్యంతరమేమి లేదు కదా అని అడుగుతున్నాడు, మామయ్య. ఇప్పటికాలంలో అంతా పిల్లల యిష్టమేగా, నాయనా!" అంది. "అదా? నీకడిగేది. సీతను నేను పెళ్లిచేసుకు గెలవ గలనా? పూర్ణను అవుతే చేసుకుంటాను. సీత పెంకిపిల్ల. వద్దు, బాబు" అని సీతముఖంకేసి నవ్వుతూ చూశాడు. సీత కోపంగా బావకేసిచూసి అక్కడనుంచి లేచిపోయింది. "ఏమిటిరా? శివా! మాట్లాడవు? వాళ్లు పిల్ల పెద్దదవుతూందని, ఉంచుటకు వీలులేదని తొందరపడుతున్నారు." అంది. "అబ్బ! ఏమిటమ్మా? ఎప్పుడూ పెళ్లి పెళ్లి అని వేపించుకుతింటావు. ఏంతొందరవచ్చింది?" అన్నాడు. "అది కాదురా, పెళ్లీడుదాటిందని తొందరపడుతున్నారు వాళ్లు" అంది. "ఏమి యీడుదాటింది? పదమూడో యేడేగా దానికి? పెద్దదవుతె ముంచుకుపోయిందేయేమిటి" అన్నాడు. "బాగా నేవుంది. ఆఖరికి చదివిన చదువు ఇందులోకి దిగిందారేమిటి?" అంది వాళ్ళమ్మ. "సరే. నీయిష్టం. నీతో జవాబు చెప్పడం

కష్టం బాబు" అని షికారుకి లేచేడు. ఆనందు, పూర్ణ, శివుడు కలసి షికారుకి వెళ్ళేరు. సీతకోసరం చూచేడుకాని సీత కనబడలేదు. సీత బావన్నమాటకు కోపంవచ్చి తనస్నేహితురాలింటికి వెళ్ళి రుమాలు కుట్టుకుంటూ కూర్చుంది.

షికారు కెళ్ళివచ్చిన శివుడు, రుమాలు తయారుచేసుకుని సీతా ఒకమారే గుమ్మంలోకి వచ్చేరు. "సీతా! ఎక్కడికి వెళ్ళేవు? కనపడలేదు" అన్నాడు బావ. "ఎక్కడికీ వెళ్ళలేదు. ఈపూళ్ళోనె యున్నాను." అంది సీత. "అబ్బా! నవ్వుతూ అంటే నీకంత కోపమెందుకు? సీతా! అందుకనే నిన్ను చూస్తే నవ్వువస్తుంది" అన్నాడు. మండితే చన్నీళ్ళ స్నానంచెయ్యి" అని నవ్వుతూ లోపలకు వెళ్ళింది సీత. సెలవలు అయిపోవుటవలన అంతా వెళ్ళిపోయారు. శివరావు బి. యే. ప్యాసయి, పట్నంలో ప్లీడరు పరీక్ష చదువుతున్నాడు. అప్పుడేవో కొన్ని యిబ్బందుల వల్ల మంచిలగ్నములులేవని రెండుమాసముల వరకు ఆగేరు. సీత పెద్దమనిషి అయింది. ఇంట్లో సీతతల్లి యేడుపు మొదలుపెట్టింది. అందరికి ఈశుభ వార్త తెలిసింది. ఒకకడుపుబ్బు బ్రాహ్మణుడు యీవార్త కాస్తా సీతమేనత్తకి చేరవేశాడు. శివుడితల్లికి పిడుగుపడినట్లయింది. ఆపిల్లను తనకోడుక్కి చేసుకొని కులంలో వెలిపడడమా, చేసుకోకుండా వుండి పుట్టింటిఆశ వదులుకోడమా తెలియలేదు. ఆఖరికి ఆమె కులంచెడుతుందనే అభిప్రాయంతో సీతను తనకోడలిగా చేసుకొనుటకు అంగీకరించలేదు. అన్నగారు వస్తేకూడా మాట్లాడలేదు. భోజన మయినా చేయకుండా వెళ్ళిపోయినాడాయన. ఈ సంగతంతా శివరావుకు ఉత్తరంవ్రాశాడు. శివుడు వెంటనే జవాబువ్రాశాడు. రజస్వలానంతరవివాహమె తనకు సమ్మతమనియు, సీతనుతప్ప యింకొకబాలికను వివాహమాడననియు, మీరు యేమిభయపడవద్దు అనియు వ్రాశాడు. సీతను ఇస్కూలుమానిపించి యింటివద్దనె తండ్రి, అన్నగారు చదువుచెపుతూ ఉండేవారు. ఇంటివద్ద తల్లికి పనులలో సహాయపడుతూయుండేది. శివరావు వచ్చి ఒకశుభముహూర్తమున సీతను వివాహమయినాడు. కాని బంధువులెవరూ రాలేదు. ఆఖరికి తల్లికూడా రాలేదు. శివరావు పట్నంలోనె ప్రాక్టీసు చేసుకుంటూ మంచివకీలని పేరు పొందేడు.

శివరావు తల్లికి బోధించి పట్నం తీసుకెళ్లేడు. ఆమెకూడా ఒక్కకొడుకుని వదలియుండలేక కొడుకువద్దనే ఉంది. సంవత్సరాదిపండుగ వచ్చింది. సీతకు కొత్తచీర పండుగకు కావాలన్నఅభిప్రాయం. కాని శివరావుతో కావాలి అని ఆమె చెప్పలేదు. అయినా అతనికి తెలుసు. అదివరకే మంచిచీర తెచ్చి పెట్టిలో దాచి ఉంచేడు. కాని పయికి తేనట్టుగానే ఊరుకున్నాడు. పండుగనాడు కొడుక్కి, కోడలికి తలంటినీళ్లు పోసింది తల్లి. సీత ఆవేళ యింట్లో సర్దుకోవడంతోటె సరిపుచ్చుతూంది. లేనిపనులుకూడా కల్పించుకుని తన పాతచీరతోటె కూర్చుంది. సీత యొక్క కోపం శివరావు మధ్యాన్నంనుంచి అన్నీ కని పెడుతూనె యున్నాడు. కాని యెరగనట్టుగా ఊరుకున్నాడు. "సీతా! పాతబట్టతోనె ఉన్నావు. మంచిచీరకట్టుకు, నగలు పెట్టుకోరాదుటె" అంది అత్తగారు. కాని ఆమె యేమీ జవాబు చెప్పక "ఏదయితె నేమిలే" అని యేదో లేనిపోనిపనులు కల్పించుకు తన పాతచీరతోటె కూర్చుంది. మధ్యాహ్నం ఫలాహారంవేళ అయింది. శివరావు, సీత ఫలాహారంచేశారు. శివరావు "ఈవేళ సినీమాకు వెడదామా?" అన్నాడు. విననట్టుగా ఊరుకుంది సీత. శివరావుకు కోపము, నవ్వుకూడా వచ్చినవి. "సీతా! ఈవేళ సినీమాకు వెళ్లాలి. పండగపూట కోపమేకాకుండా చెముడుకూడా వచ్చిందా యేమిటి?" అన్నాడు శివరావు. "ఫలాహారం అయిందికదా వెళ్లండి" అంది సీత. "ఓహో! నాకు సెలవు యిచ్చేవుకదా? ఇప్పుడు కూడా

రావాలి అని నేను అడగడం" అన్నాడు. "నేను రాకపోతే సినీమా కాదా" అంది. "మువ్మాటికి సినీమాకాదు" అన్నాడు. "సరే పదండి." అంది. "ఇలాగేనా? సినీమాకు రావడం" అన్నాడు. "ఇంకే లాగొ నాకర్థమగుట లేదు" అంది. సీత పట్టుదలకు తనలో నవ్వుకుని "సరే, నాతోలుసంచి యిలాతెచ్చి పెట్టు" అన్నాడు. సీత తోలుసంచి తెచ్చింది. సంచితెరచి అందులోవున్న అందమయిన చీరతీసి "ఇదుగో చీర" అని సీత చేతికిచ్చి "అబ్బ! నీవెంత అసాధ్యురాలవో నాకు తెలుసు. అందుకనే చిన్నప్పుడే చెప్పేను. సీతతో వేగలేను బాబు అని."ఇట్లని నవ్వేడు. సీత ముఖంవికసించింది. చీకటిగాఉన్నగది సీత నవ్వులో వెల్గు వచ్చినట్టుంది. సీత తన నూతనవస్త్రము కట్టుకు శివరావుకు, అత్తగార్కి నమస్కరించింది. "ప్రొద్దున్నుంచి ఒక సినీమా చూపించేవు సీతా! ఈవేళ నీవు" అన్నాడు శివరావు.

## జ్ఞానోపదేశము

శ్రీమతి గంటి కామేశ్వరమ్మ గారు

ఆలమందలు ఆటబయలున
మేతలను వే మేయుచుండగ
గోపబాలుఁడు కోర్కెమీఱఁగ
నట్టెఁగూర్చుండి.
ముదముమీఱఁగ మురళిఁచేఁగొని
ముద్దులొల్కఁగ మూతినునిచి
సరసమ్మగుసారస్యసంగీ
తములవాయించెన్.
మధురసంగీతమునువిని గో
పికలువేగమె పరుఁగులెత్తియు
వారిజాక్షుని వారలందరుఁ
జూచి యిట్లనిరి.
"వారిజాక్ష! నీవారమేయని స
ల్లలితముగఁ గృపజూపుమామము
విరహమునకోర్వంగఁజాలము
మదనగోపాలా!"
చేరరాఁజేడియలఁగనుఁగొని
రాధకాంతుఁడు రమణులన్‌గని
వలపుతోలఁగఁగ వారికిన్ మఱి
యిట్లుబోధించెన్.

"ఇంతులార! యిదేటివెఱ్ఱిక
వేఁగబొంకు మీవిభులచెంతకు
అత్తమామల యాజ్ఞలేవిడె
తగునె యేతెంచన్?
పరులుజూచినఁ బడనినిందల
పాలుచేతురు పాపమెరుగక
లోకులకుఁలోఁబడఁగవలయును
నిజము నారయగన్."
నీలవర్ణుని నీతిమాటల
ఇంపుగుదురగ నింతలున్‌విని
సారసాక్షుని సరసనిలిచిరి
పతుల నొసరించి.
"నందనందన! నీదునిర్మల
భావపూరితభవ్యగానము
విరహపతులగు వనితలన్‌మము
జ్ఞానులుగఁజేసెన్.
సృష్టిలయకార! మహాదేవ! శ్రుతులుస్మృతులు
నీదులీలలఁబొగడంగ నేరకున్న
విచలమతులము మేమెంతవారమయ్య
నిన్నుఁబొగడంగఁదలపెట్ట నీరజాక్ష!"